

# బురుజువీధి కథలు

- కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# చివరి కోరిక

**ఆరోజు** సాయంత్రం నేను ఆఫీసులోవుండగా టౌన్నుంచి నాకు చిన్నాన్నవరసయ్యే క్రిష్ణమూర్తొచ్చాడు. ఆయన చిన్నకూతురి పెళ్లిసంబంధం విషయంలో మా బురుజువీధిలోని జ్యోతిష్యుడు భూతనాథశర్మకు జాతకాలు చూపించడానికి వచ్చాడు.

నేనాయన్ని క్షేమసమాచారాలు అడిగి, కాఫీ తెప్పించి "భూతనాథ్ ఆరోగ్యం ఈమధ్య బావుండడంలేదు. పొద్దున కనుక్కుంటే యీరోజు ఫరవాలేదన్నారు, మనం వెళ్లచ్చు" అన్నాను.

"నువ్వున్నావనే వచ్చాను సూర్యం. యీ సంబంధం అన్నివిధాలా బావుంది, మా అమ్మాయి, ఆకుర్రాడు వొకే ఆఫీసులో పనిచేస్తున్నారు. వొకరికొకరు నచ్చారు. జాతకాలు చూపిస్తే అబ్బాయి జాతకంలో దోషంవుందని టౌన్లో నాకుతెలిసిన జ్యోతిష్యులందరు చెప్తున్నారు. మీ భూతనాథశర్మ దోషంలేదని చెప్తే నాకు నికరంగా వుంటుంది" అని నిట్టూర్చాడు మా బాబాయ్.

“యీయనా అదేశాస్త్రాన్ని చదివుంటాడుగదా, వేరేగా యెందుకు చెప్తాడు?" అన్నాను

"యీయన జ్యోతిష్యంలో వుద్దండుడు, సూక్ష్మగ్రాహి. మిగతావన్నీ బావుండి యేదైనా ఒక దోషం అడ్డొస్తే యీయనకి చూపించమని టౌన్లోని జ్యోతిష్యులే పరోక్షంగా చెప్తారు. భూతనాథశర్మ మీవూర్లోనే వుండిపోయాడుగాని టౌన్లో ఐతేనా జనం క్యూకడుదురు, కోట్లు సంపాయించేవాడు" అన్నాడు బాబాయ్ భూతనాథ్ పట్ల సానుభూతిగా.

నాపని ముగించి లేచాను. ఇద్దరం బజారువీధులు దాటి గోశాలవీధిలో నడుస్తూ మావీధి మొదట్లోవున్న బురుజు దగ్గరికొచ్చాం. మా బురుజువీధిలోకి తిరగబోతూండగా భూతనాథశర్మ చిన్నకొడుకు మిహిర్ స్కూటర్లో ఎదురయ్యాడు."నాన్నకెలావుంది?" అనడిగాను.

“యీరోజు ఫర్లేదన్నా. నేను మందులకోసమెళ్తున్నా" అన్నాడు.

అతన్ని మరికొన్ని వివరాలడిగి పంపించాక ముందుగా మాయింటికెళ్లాము. మాఆవిడ కామేశ్వరి ఆయనకు ఫలహారం, కాఫీ ఇచ్చి పెళ్లిసంబంధం వివరాలడిగి "యిక్కడికొచ్చి మంచిపని చేసారు. భూతనాథ్ గారు కరెక్టుగా చెప్తారు" అంది నావైపు చూడకుండా. నాక్కొంచెం వింతగా అనిపించింది. జ్యోతిష్యంలాంటివి కామేశ్వరి నమ్మదు.

నేనూ మాబాబాయ్ భూతనాథింటికి బయలుదేరాం. వాళ్లది మా కచేరిసత్రం వరసలో తొమ్మిదోయిల్లు. వాళ్ల కాంపౌండుగోడకు ఆనుకుని 'ఎక్స్' ఆకారంలో రెండు కొబ్బరిచెట్లుంటాయి. వాళ్లిల్లు కనుక్కోవడానికి ఎవరికేనా అదే గుర్తుగా చెప్తారు.

మావీధిచివర నదివొడ్డునున్న మార్కండేశ్వరాలయంలో ఏవో పూజలు జరుగుతున్నాయి. అసాయంత్రం వీధి కొంత సందడిగానేవుంది. మావీధి 'వార్తల వనజమ్మ' హడావుడిగా ఎవరింటికో వెళ్తోంది.

మేం వెళ్లేసరికి ఆయన భార్య అనసూయమ్మ సహాయంతో అప్పుడే గదిలోంచి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. మనిషి బాగా మెత్తబడ్డాడు, ఆయాసపడుతున్నాడు.

మమ్మల్ని పలకరించి నీరసంగానవ్వి "పందురాలేసమయం దగ్గరపడింది" అన్నాడు.

"అన్నీ తెలిసినవాడివి నువ్వే అలా మాట్లాడితే యెలా?" అని నేను ఈరోజుల్లో వైద్యశాస్త్రం ఎంతగా అభివృద్ధి చెందిందో, చనిపోయినవాళ్లనుకూడా ఎలా బతికిస్తున్నారో వివరించి ఆయనకు తొందర్లోనే బాగైపోతుందని చెప్పాను.

ఆయన నవ్వి "జ్యోతిష్యుడికే జ్యోతిష్యం చెప్తున్నావు" అని, బాబాయివైపు చూసాడు.

మాబాబాయ్ లేచి ఆయనకు తనుతెచ్చిన కాగితాలిచ్చి అబ్బాయివి, అమ్మాయివి జాతకాలు సరిపోతాయేమో చూడమని అడిగాడు. ఆయన కాగితాల్ని పక్కనబెట్టి, తన పుస్తకం, కళ్లజోడు తెమ్మని మనమరాలికి చెప్పి, వధూవరుల వివరాలు, పెళ్లిమాటలెంతవరకు వచ్చాయి ఇలాంటివన్నీ అడిగి తెలుసుకున్నాడు.

మనమరాలు పుస్తకం, కళ్లజోడు తెచ్చాక కాగితాల్ని పరీక్షగా చూసి "జాతకాలు సరిపోతున్నాయి. నిక్షేపంగా ముహూర్తాలు పెట్టుకోవచ్చు" అన్నాడు

"మావూరివాళ్లు అబ్బాయి జాతకంలో దోషం వుందంటున్నారు" అని నసిగాడు బాబాయ్.

అప్పుడాయన గ్రహాలగతులను వివరించి, ఆ జాతకాన్ని ఏకోణంలో చూడాలో చెప్పి మొత్తానికి దోషం రెప్పపాటులో తప్పిపోయిందన్నాడు. నాకు ఆయన చెప్పిందేమీ అర్థంకాలేదు. మాబాబాయ్ తలవూపి సంతోషంగా ఆయనకు తాంబూలమిచ్చి ఆశీర్వచనం తీసుకున్నాడు. వెళ్లేముందు నేనాయన చెయ్యిపట్టుకుని ఆరోగ్యజాగ్రత్తలు చెప్పాను.

ఇంటికొచ్చాక “ఆయన నీరసంలో సరిగ్గానే చూసాడంటావా, టౌన్లోవాళ్లంతా దోషముందని బల్లగుద్దిచెప్పారు" అన్నాడు బాబాయ్.

“యీయన చెప్పిందే ఫైనల్ అనుకుని వచ్చారు. మిగతావన్నీ నచ్చాయి. యిక సంశయాలెందుకు మామయ్యా?" అంది కామేశ్వరి. నేనూ తలవూపాను.

"అంతేలే" అని సమాధానపడి, భోజనం చేసి ఆరాత్రే టౌనుకెళ్లిపోయాడు మాబాబాయ్.

“నాకెందుకో యీభూతనాథ్ శాస్త్రానికి లౌక్యం జోడిస్తాడనిపిస్తుంది. పైగా జాతకాలు చూసేప్పుడు హోమియో డాక్టరడిగినట్టు ఇతరవివరాలన్నీ అడుగుతాడు. 'యీయన పరిస్థితిని బట్టి' చెప్తాడని కొందరంటారు. లెక్కల్లో అఖండుడుగాబట్టి చెల్లిపోతూంది. వీళ్ల నాన్న భైరవశర్మ అలాకాదు, నిక్కచ్చిగావుండేవాడు" అన్నాను నేను రాత్రి నిద్రపోయేముందు.

“తండ్రి జ్యోతిష్యశాస్త్రమొకటే చదువుకున్నాడు, కొడుకు అదనంగా భౌతికశాస్త్రం, ఆధునికగణితం, మనస్తత్వశాస్త్రంకూడా చదువుకున్నాడు మరి" అంది కామేశ్వరి నిద్రలోకి జారుకుంటూ.

నాకు నిద్రపట్టలేదు. భూతనాథ్ తండ్రి భైరవశర్మ గుర్తొచ్చాడు. 'భైరవయ్య' అనేవాళ్లు. జ్యోతిష్యం వాళ్లింట్లో వంశపారంపర్యంగా వచ్చింది. భైరవయ్య పుట్టుకతో బలహీనంగా ఉండేవాడు. అతనికి విద్య బాగాతెలిసినా మరీ నిక్కచ్చిగా చెప్తాడనే పేరుండేది. పెద్దగా జనం వచ్చేవాళ్లు కాదు. ఇంట్లో తినడానికిలేక ఒక్కోరోజు బియ్యం, పప్పు మాయింట్లో తీసుకెళ్లేవాళ్లు.

భైరవయ్యకు అంత జనాదరణ లేకపోవడం గురించి చెప్తూ "సంఘానికి అపారమైన నమ్మకముండే శాస్త్రాలను ఖచ్చితంగా అనుసరించేవాళ్లన్నా సంఘానికి నచ్చదు, తమకనుకూలంగా కొంచెమన్నా కల్తీవుంటేగాని వొప్పుకోదు. అందుకే ప్రతీదానికి పరిహారాలు, శాంతులు వుంటాయి" అన్నాడు మానాన్న ఓసారి. ఆయన చెప్పిందేంటో ఆవయసులో నాకు బోధపడలేదు.

భైరవయ్య దెయ్యాలకథలు, వొళ్లు గగుర్పొడిచే అనుభవాలు బాగాచెప్పేవాడు. మేం చిన్నప్పుడు వాళ్లింటికెళ్లి చెప్పించుకునేవాళ్లం. 'మా తాత జోగయ్య మంత్రశక్తితో రాత్రిళ్లు మగదెయ్యాలచేత చేలు దున్నించేవాడు, ఆడదెయ్యాలచేత కలుపు తీయించేవాడు' అనిచెప్పి 'ఆదెయ్యాల శాపంవల్లే మావాళ్లు భూములన్నీ పోగొట్టుకున్నారు' అని నిట్టూర్చేవాడు.

ఆయన ఒకరాత్రి చెప్పిన కథ నేనెప్పటికీ మర్చిపోలేను. వాళ్ల నాయనమ్మ పేరమ్మ గొప్ప మంత్రసానట. ఒకసారి అర్ధరాత్రి ఇద్దరాడవాళ్లు వాళ్లింటికొచ్చి తలుపుతట్టి ఒకావిడకు కాన్పు చెయ్యాలని పేరమ్మను వూరవతల మామిడితోటలోని ఇంట్లోకి తీసుకెళ్లారట. అక్కడ ఒకామె నొప్పులు పడుతోంది. వెల్తురు సరిపోకపోతే పేరమ్మ దీపాన్ని పెంచమని అడిగింది. అప్పుడొకామె నాలుకతో వత్తిని పెద్దదిచేసింది. పేరమ్మకు వాళ్లు దెయ్యాలని అర్థమైంది. వాళ్లకాళ్లవైపు చూస్తే వెనక్కి తిరిగున్నాయి. ఏదోకావలసి పేరమ్మ వంటగదిలోకెళ్తే అక్కడ ఒకావిడ విస్తరిముందు కూర్చుని చేతులువెనక్కి పెట్టుకుని ముందుకువొంగి రాశిగాపోసిన అన్నాన్ని నాలుకతో తీసుకుని తింటోంది. మంత్రంరాకపోయినా పేరమ్మ భయపడకుండా కాన్పు చేసిందట. కృతజ్ఞతగా ఆదెయ్యాలు నీళ్లుకాచుకునే రాగిఅండా ఇచ్చాయట.

ఈ కథవిన్నాక మాకు ఇళ్లకెళ్లడానికి భయమేస్తే భైరవయ్యే తోడుగా వచ్చాడు. మర్నాడు పగటిపూట భైరవయ్య మాకందరికి వాళ్లింట్లోవున్న పాత రాగిఅండా చూపించి అది ఆ దెయ్యాలిచ్చిందేనని చెప్పాడు. దానిమీద ఏదో భాషలో రాసివుంది. అది దెయ్యాలభాషలో 'పేరమ్మ' అని చెప్పాడు.

ఆతరువాత కాలేజినుంచి సెలవులకి ఇంటికొచ్చిన భూతనాథ్ కి మేం ఆకథ చెప్పాం. అతను పెద్దగానవ్వి "మీకూ చెప్పాడూ? అది మానాన్న వృత్తిలో భాగం. ఐతే సమస్య యేమిటంటే ఆకథను నిజమని ఆయనా నమ్ముతాడు" అన్నాడు. అప్పుడు మాకతని మాటలు అర్థంకాలేదు.

భైరవయ్యకు భూతనాథ్ ఒక్కడే కొడుకు. ఆతరువాత ఇద్దరాడపిల్లలు. వయసులో మాకంటే పెద్దవాళ్లు. భూతనాథ్ చదువులో చురుకైనవాడు. మానాన్నదగ్గర ఇంగ్లీషు, లెక్కల్లో సందేహాలు తీర్చుకునేవాడు. స్కూలుఫైనల్లో

లెక్కల్లో జిల్లాఫస్టు వచ్చాడు. అతనికి జ్యోతిష్యవిద్య ఇష్టముండేదికాదు. వాళ్లనాన్న బలవంతంమీద సెలవుల్లో నేర్చుకున్నాడు.

మావూళ్లో స్కూలుఫైనలయ్యాక ఇక చదువించేందుకు డబ్బులేక భైరవయ్య కొడుకుని జ్యోతిష్యం చూసుకోమన్నాడు. మానాన్నే చందాలు పోగుచేసి, టౌన్లో వారాలు ఏర్పాటుచేసి భూతనాథ్ ని బీయస్సీలో చేర్పించాడు. అతను డిగ్రీ పూర్తిచేసి ఆతరువాత బెనారస్ లో స్కాలర్షిప్పు సంపాదించుకుని ఎమ్మెస్సీ ఫిజిక్సులో చేరాడు.

ఎమ్మెస్సీలో చేరిన ఆర్నెల్లకే భైరవయ్యకు బాగా జబ్బుచేసి భూతనాథ్ ఇంటికొచ్చేసి ఉండిపోవాల్సొచ్చింది. చదువు ఆగిపోయింది. ఇల్లుగడవక తండ్రిస్థానంలో జ్యోతిష్యుడిగా వృత్తి మొదలుపెట్టాడు. త్వరలోనే ఆవిద్యలో అతను నిష్ణాతుడై జిల్లాస్థాయిలో పేరొచ్చి సంపాదన పెరిగి ఊర్లోనే ఉండిపోయాడు. తండ్రిపోయాక అప్పులుతీర్చేసి చెల్లెల్ల పెళ్లిళ్లు చేసాడు.

భూతనాథ్ నాకెప్పుడూ అర్థమయ్యేవాడుకాదు. అతను మావీధిలో జ్యోతిష్యుడిగా స్థిరపడ్డాక నాకు జ్యోతిష్యం నేర్పమని అడిగాను.

అతను పెద్దగా నవ్వి "నీకెందుకురా యిట్లాంటివిద్యలు, చక్కగా చదువుకొని పనికొచ్చేపనేదైనా చెయ్యి" అన్నాడు.

"పదిమందికి భవిష్యత్తు చెప్పే పని పనికిరాందెలా ఔతుంది" అని నేను విక్రమార్కుడిలాగ వెంటబడ్డంచూసి “సరే” అని మొదట గ్రహాలగురించి ఖగోళశాస్త్రం బోధించాడు. ఆతరువాత ఎప్పుడడిగినా “నీకు చెప్పదగిందదే, చెప్పడం ఐపోయింది" అనేవాడు. చివరికి నేనునేర్చుకోవడం అతనికిష్టంలేదేమోనని అడగడం మానుకున్నాను.

తరువాతిరోజుల్లో అతనిదగ్గరికి తీసుకెళ్లమని చాలామంది నాకు తెలిసినవాళ్లు, చుట్టాలు వచ్చేవాళ్లు. నేను తీసుకెళ్లినవాళ్లను ప్రత్యేకంగా పరామర్శించి వాళ్లు సంతృప్తి పడేవిధంగా చెప్పేవాడు. దక్షిణ ఎక్కువతీసుకునేవాడు కాదు.

కామేశ్వరి జ్యోతిష్యాన్ని నమ్మదు. పెళ్లైనకొత్తల్లో మేం దానిగురించి వాదించుకునేవాళ్లం.

ఒకసాయంత్రం వీధిచివర నదివొడ్డున మార్కండేశ్వరాలయం పక్కన భూతనాథ్ ని "కామేశ్వరి యిదంతా నమ్మదు. నిజంచెప్పు, జ్యోతిష్యం నిజమా? అపద్ధమా?" అనడిగాను.

చీకటివెలుగుల్లో గతానికి వర్తమానానికి లంకెగా నిలబడి అతని సమాధానానికి ఎదురుచూస్తున్నట్టుంది గుడికెదురుగావున్న రాయుడిగారి బంగళా.

భూతనాథ్ నదికవతల పనిచేయడం ఆగిపోయిన ఫ్యాక్టరివైపు వేలు చూపించి "అక్కడ ఫ్యాక్టరీ వుందంటావా? లేదంటావా?" అనడిగాడు

"వుందంటే పనిచేస్తేనేగదా ఫ్యాక్టరి అంటావు, లేదంటే అక్కడ కనబడుతోందిగదా అంటావు. నువ్వెప్పుడూ అంతే, యేదీ సరిగ్గా చెప్పవు" అన్నా ఉక్రోషంగా.

పెద్దగా నవ్వేసి నా భుజంతట్టి "కొన్ని ప్రశ్నలకి పూర్తి సమాధానమిస్తే తల పగిలిపోతుందని విక్రమార్కుడికేగదా పార్వతీదేవి శాపం యిచ్చింది?" అన్నాడు.

"యిదింకా అన్యాయంగావుంది. ఫ్యాక్టరిగురించిన ప్రశ్నే మేలు" అన్నా నేనూ నవ్వుతూ. ఆతరువాతెప్పుడూ అతన్తో జ్యోతిష్యంగురించి మాట్లాడలేదు.

వాళ్లింట్లో జ్యోతిష్యం భూతనాథ్ తోనే ఆఖరౌతుంది. అతను తన ఇద్దరుకొడుకులకు, కూతురికి దాన్ని నేర్పించకుండా, టౌన్లోవుంచి పై చదువులు చెప్పించాడు. వాళ్లు చుట్టుపక్కల ఉద్యోగాలు చేసుకుంటున్నారు. శనాదివారాలు వచ్చివెళ్తూంటారు.

భూతనాథ్ గురించి అలోచిస్తూనే ఎప్పుడో ఆలస్యంగా నిద్రలోకి జారుకున్నాను.

మా బాబాయ్ వచ్చివెళ్లిన రెండువారాల తరవాతనుంచి భూతనాథశర్మ ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. టౌనుడాక్టర్లు ల్యుకేమియా అని తేల్చారు. ఆయన సిటీలకెళ్లి కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి 'అనవసర హైరానా' అని ఒప్పుకోలేదు. ఇతర జ్యోతిష్యులు గ్రహబలంచూసి శాంతులు, పూజలు సూచిస్తే తిరస్కరించి "డాక్టర్లకంటే మంచి జ్యోతిష్యులెవరు?" అన్నాట్ట.

నేనప్పుడప్పుడూ వెళ్లి చూసొస్తున్నాను. మానాన్నతో అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుని రెండుమూడుసార్లు కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. ఆయనెప్పుడూ నొప్పి, చావుల గురించి భయపడలేదు. అది 'శరీరధర్మం' అనేవాడు. క్రమంగా మాట్లాడ్డం తగ్గించేసాడు. "యికరోజుల్లోకొచ్చిందని డాక్టరు చెప్పాడు" అన్నాడు ఆయన పెద్దకొడుకు భాస్కర్ రెండ్రోజుల కిందట కనపడి.

మరో మూడువారాలతర్వాత ఓ తెల్లవారుఝామున ఆయన నిద్రలోనే పోయాడు. వెంటనే వాళ్లింటిముందు చిన్న మంటవేసారు. ఒక ఇంట్లో ఎవరైనా పోతే అందరికి తెలిసేట్టు వాళ్లింటిముందు చలిమంటలాంటిది వేసే పూర్వాచారం మావీధిలో ఇప్పటికీ పాటిస్తారు.

రావలసినవాళ్లందరూ వచ్చివున్నారుకాబట్టి ఆరోజు మధ్యాహ్నం ఆయన భౌతిక కాయాన్ని తీసుకెళ్తారని తెలిసింది. నేను, కామేశ్వరి తొమ్మిదిగంటలకు వాళ్లింటికి వెళ్లాం.

అప్పటికే మా వీధి సంక్షేమసంఘ పెద్దలు వచ్చి వరండాలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వూళ్లో పెద్దలుకూడా వచ్చారు. మేం హాల్లోవుంచిన ఆయన భౌతిక కాయానికి నమస్కరించి, కుటుంబసభ్యుల్ని ఓదార్చాం. కామేశ్వరి సాయంచెయ్యడానికి వంటింట్లోకెళ్లింది. నేను వరండాలో వచ్చి కూర్చున్నాను. భూతనాథ్ కొడుకులు భాస్కర్,

మిహిర్ వచ్చినవాళ్లతో మాట్లాడుతూ అటుయిటూ తిరుగుతున్నారు. మావీధి 'పరోపకారి పాండురంగ' బయటా అతని భార్య సుశీల లోపలా జరిగే ఏర్పాట్లకి సహాయపడుతున్నారు.

పదిగంటలకు పురోహితుడొచ్చాడు. మావీధి పెద్దలు భూతనాథ్ కొడుకుల్ని కూర్చోబెట్టి తదుపరి కార్యక్రమంగురించి మాట్లాడారు. పదమూడురోజులపాటు చెయ్యాల్సిన విధానాలన్నీ నిర్ణయించారు. వాళ్లు పురాతనకాలంనుంచి వస్తున్న ఏవొక్క పద్ధతీ వదల్లేదనిపించింది.

మా ఎదురింటి చలపతి కొన్నిటిపేర్లు చెప్పి "అవి అవసరమంటారా, వాటినిప్పుడెవరూ పాటించడంలేదనుకుంటా" అన్నాడు. మా వీధి సంఘపెద్దలకు చలపతి ధోరణి నచ్చలేదు.

"పాటించకపోవడం తప్పు. తప్పును సరిదిద్దుకోవాలిగదా చలపతీ" అని సర్దిచెప్పాడు మా సంఘ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి. మిగతా సభ్యులంతా దాన్నే బలపరుస్తూ మాట్లాడారు.

"యిలాంటప్పుడు ఖర్చుగురించి చూసుకుంటే ఆయన ఆత్మకు శాంతి కలుగుతుందా?" అడిగాడు బసవలింగం.

"చలపతి వాళ్లమంచికే ఆలోచిస్తున్నాడు. కానీ మనంచెప్తున్నవి యెక్కువేంకాదు. యిప్పుడు వాళ్లకేలోటూ లేదు, ఆపైన మనంలేమా" భరోసా ఇచ్చాడు ధనరాజ్.

"చలపతి ఖర్చుగురించికాదు చెప్తున్నది. అనవసర ఆచారాలెందుకని" అన్నాన్నేను.

"భూతనాథశర్మ మన ఆచారసంప్రదాయాలకు ప్రతీక. జీవితం జ్యోతిష్యానికే అంకితంచేసాడు. ఆయనవిషయంలోనే వెనకడుగెయ్యడం సబబుకాదు" మెత్తగా మందలించాడు మునిరెడ్డి.

"మన అసలైన వైదిక పద్ధతిలో యిన్ని ఆచారాలు లేవు. అంతకు ముందువి కొన్ని, ఆతరువాతవి కొన్ని చేరాయి అందుచేత అన్నీ పాటించక్కరలేదు" అన్నాడు కాశీనాథ్. అతనివైపెవరూ చూడలేదు.

"జిల్లాలో తనంతటి జ్యోతిష్కుడులేడని పేరు తెచ్చుకున్నాడు, ఘనంగా ఆచారాలు పాటించకపోతే బాగుంటుందా" సందేహించాడు స్వామినాయుడు.

వచ్చిన వూర్లోని పెద్దమనుషులుకూడా ఈమాటనే బలపరిచారు. తూచా తప్పకుండా పదమూడురోజులూ అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తేనే బావుంటుందని చివరికి తేల్చారు.

భాస్కర్ లేచినిలబడి "మా నాన్నమీద వూళ్లో పెద్దలందరికీ యెంత గౌరవముందో చూస్తూంటే ఆయన ధన్యజీవి అనిపిస్తోంది. మేం ఖర్చుకు వెనకాడం. మీరందరూ నిర్ణయించినట్టే చేద్దాం" అన్నాడు. మిహిర్ కూడా ఔనంటూ తలవూపాడు.

“యిప్పటికవసరమైనవి నేను తెచ్చాను. సాయంత్రమొచ్చి మిగతావన్నీ మీకు వివరించి, కాగితంమీద రాసిస్తాను” అని పురోహితుడు సహాయకులకు మొదలుపెట్టాల్సిన పనులను పురమాయించాడు.

భూతనాథ్ కూతురు రేఖ తలుపుదగ్గరికొచ్చి “అన్నయ్యా వొకసారి లోపలికి రండి, అమ్మ పిలుస్తోంది" అనిచెప్పి వెళ్లింది. భాస్కర్, మిహిర్ లోపలికెళ్లారు.

అందరికీ మంచినీళ్లు, కాఫీలు వచ్చాయి. మేం మళ్లీ మాటల్లో పడ్డాం. ‘తమకు ఇబ్బందుల్లేకుండా భూతనాథశర్మ ఏవిధంగా జాతకాల సమస్యలు పరిష్కరించాడో, భవిష్యత్తుగురించిన చక్కటి సలహాలిచ్చాడో’ వూళ్లోవాళ్లు ఒక్కొక్కరే గుర్తుకు తెచ్చుకోవడం ప్రారంభించారు.

టైం పదకొండున్నర దాటింది. పురోహితుడు అన్నీ సమకూర్చుకుని తయారుగా ఉన్నాడు. లోపలికి వెళ్లిన భూతనాథ్ కొడుకులు అరగంటదాటినా బయటికి రాలేదు. ‘చెయ్యాల్సిన కార్యక్రమాలు బోలెడున్నాయని, సమయం మించిపోతూoదని’ మా వీధి పెద్దలకు అసహనం మొదలైంది.

ఆలస్యం ఎందుకౌతోందో అర్థంకాక వరండాలోని వాళ్లంతా అయోమయంలో పడ్డారు. లోపల కొడుకులిద్దరిమధ్య ఖర్చు పంచుకోవడం విషయంలో తేడాలొచ్చాయా అని ఒకరిద్దరు గుసగుసలు పోవడం వినిపించింది. కొందరు ‘శర్మ తీర్చాల్సిన బాకీలున్నాయేమో’ అని చర్చించుకున్నారు. అసహనంతో పాటు అందరికీ ఆసక్తీ పెరిగింది.

పురోహితుడు రిస్టువాచి చూసుకొని లేచి లోపలికెళ్లాడు. మా సంఘ జాయింట్ సెక్రెటరి సోమయాజులుకూడా వెళ్లాడు.

మరోపదినిముషాలు గడిచాక భాస్కర్, మిహిర్ ఒక కాగితం పట్టుకుని వరండాలోకి వచ్చారు. వాళ్లు నిజంగానే ఆస్తిగొడవలోవున్నారని, పెద్దమనుషుల సలహాకోసం బయటికొచ్చారని అనుకున్నారు.

భాస్కర్ చేతులు జోడించి "మానాన్న నెలముందు మాకుటుంబానికి, చుట్టాలకు, మావీధివాళ్లకు కలిపి ఒక ఉత్తరం రాసాడు. తాను పోయినవెంటనే దాన్ని ముందు మేము చదివి, తరువాత వచ్చినవాళ్లందరి ముందు చదవాలనిచెప్పి అతికించి సీలువేసిన కవరులోవుంచి మాఅమ్మకు యిచ్చారట. అందులోవున్న ఆయన చివరికోరిక ప్రకారం మమ్మల్ని చెయ్యమని చెప్పారట" అన్నాడు.

"ఆ వుత్తరాన్ని మా అమ్మ మాకిందాకే యిచ్చింది. మేము చదివి యేంచెయ్యాలో తేల్చుకోలేక తర్జనబర్జన పడుతున్నాము" అన్నాడు మిహిర్.

“తర్జనబర్జనెందుకు? ఆయన చివరికోరికేంటో చదవండి. అలాగే చేద్దాం. ఖర్చుసంగతి తర్వాత చూసుకుందాం. కార్యక్రమాలకు ఆలస్యమౌతోంది" అన్నాడు మాసంఘ ఉపాధ్యక్షుడు మూర్తి.

భాస్కర్ తలుపుదగ్గర నిలబడి లోపలివాళ్లక్కూడా వినిపించేట్టు ఆ ఉత్తరాన్ని పెద్దగా చదివాడు. దాని సారాంశమిది.

'జ్యోతిష్యశాస్త్రమంటే ఆసక్తిలేకపోయినా దాన్ని నేను వృత్తిగా స్వీకరించాక నిబద్ధతతో పూర్తిగా నేర్చుకున్నాను. ఎవరైతే దాన్ని నిజంగానమ్మి నాదగ్గరికొచ్చారో వాళ్లకు ఆశాస్త్రప్రకారమే నిజాయతిగా చెప్పాను. కాని చాలామంది అదంటే భయంచేతనో, తాము అనుకున్నదే జరగాలనో లేక నలుగుర్నీ తృప్తిపరిచేందుకో తమకు అనుకూలంగా చెప్పించుకోవడానికి పరోక్షంగా వొత్తిడి చేయడం చూసి ఆశ్చర్యపోయాను. ఖచ్చితంగా పాటించడంకాక, పరిహారాలతో యేదోవిధంగా తృప్తిపడితే చాలనేవాళ్లే యెక్కువయ్యారు.

నాదగ్గరికి ఇతరమతాలవాళ్లుకూడా రావడంకూడా వింతగా అనిపించింది. మతమేదైనా యెప్పుడో రాసిపెట్టిన శాస్త్రంకంటే యిప్పటి వ్యక్తుల అవసరానిదే పైచేయిగా వున్నట్టు నాకర్థమైంది. మానాన్న పద్ధతికి భిన్నంగా క్రమంగా వచ్చినవారికి అనుకూలంగా చెప్పడానికి అలవాటు పడాల్సివచ్చింది. ఐతే శాస్త్రాన్ని యెప్పుడూ వక్రీకరించలేదు, అందులో వున్న వెసులుబాటుల్నే వాడుకున్నాను.

మన సంప్రదాయాలకు మూలాలైన వేదాలను, ఉపనిషత్తులను నాకుచేతనైనంతవరకు లోతుగా చదివాను. మన మూలాలకు విరుద్ధంగా ఉన్న కొన్ని ఆచారాలను నేను పాటించలేదు. సంఘాన్ని ఒక సమపద్ధతిలోవుంచే సంప్రదాయాలపట్ల నాకు గౌరవముంది. కాని చాలామంది వాటినితమకనుకూలంగా వున్నప్పుడే పాటించడం చూసాను.

మనంపాటిస్తున్న మరణానంతర కర్మకాండ వేదకాలానికి ముందుండిన అమాయకుల ఆచారమని, దాన్ని మనం తెలిసో తెలియకో కొనసాగిస్తున్నామని నేనొక నిర్ధారణకొచ్చాను. అలాగే భర్త పోయిన తరువాత స్త్రీ పాటించాల్సిన సంప్రదాయం మధ్యలో చారిత్రక కారణాలవల్ల దూరిన దురాచారమని నా నమ్మకం.

ఇవి నా వ్యక్తిగత అభిప్రాయాలు, ఇతరులు అంగీకరించాల్సిన పనిలేదు. ఇలా చెప్పడంవల్ల నేనెవరినైనా బాధించివుంటే నన్ను మన్నించప్రార్థన. నేను కన్నుమూసాక నా జబ్బుదృష్ట్యా నా అవయవాలు దానంచేసే అవకాశం లేనందుకు విచారిస్తున్నాను.

నా మరణానంతరం నా భౌతికకాయాన్ని ఏ విధమైన కార్యక్రమాలు చేయకుండా అగ్నికి ఆహుతిచేసి ఇక వూరుకోవాలని, తరువాతకూడా ఏవీ చేయకూడదని, అంతేకాక నాశ్రీమతి ముత్తైదువగానే కొనసాగాలనేది నా చివరికోరిక. ఇది నా వ్యక్తిగత నిర్ణయం. నన్నర్థం చేసుకుని దీనికి భిన్నంగా చేసి నన్ను అవమానించకూడదని నా అభ్యర్థన!!!'

భాస్కర్ చదవడం ముగించాడు. అక్కడ చీమ చిటుక్కుమంటే వినపడే నిశ్శబ్దం అలుముకుంది.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments